

# తల్లివేరు

**ఉసూరుమంటూ సాయంత్రం ఇల్లు చేరుకున్న సమయాన బయట అపరిచితమైన చెప్పుల జత కనిపింగానే సైకిల్‌తోపాటు ఆలోచనలకూ బ్రేకు పడింది.**

గుమ్మంలో కెళ్లగానే ఆరడుగుల ఆగంతకుడు లేచి నమస్కరిస్తున్నాడు. ''నమస్కారం! కూర్చొండి!'' అంటూ హడావుడిగా లోపలికెళ్లాడు.

ఇంట్లో కెళ్లగానే పెన్సిల్ అటాచ్‌డ్ రబ్బరులా మా ఆవిడ ఇదిగో లుంగీ, అదిగో సబ్బు బిళ్ల, ఇందా టవల్.... అంటూ అధమం నాలుగు నిముషాలు కనిపించే వాటినే చూపిస్తూ, అందే వాటినే అందిస్తూ అంటి పెట్టుకొని తిరుగుతూ నా మొహంలో మంచి-చెడ్డా చదూకునే ప్రయత్నం చేస్తూంది ఇందులో ఏ మాత్రం తేడా వచ్చినా నాకా సాయంత్రమంతా అసంతృప్తే. అంతేకాదు, ఆ తేడాకు కారణాలు వెతుక్కోవడమో, తెలుసుకునే ప్రయత్నమో (చేస్తూ మొదటిసారి పదో తరగతి పరీక్ష రాసేవాడిలా గడపాల్సొస్తుంది) చేయాల్సి ఉంటుంది.

అలా తిరుగుతున్న శ్రీమతి ద్వారా 'వచ్చినవాడి' గురించి కొన్ని వివరాలు రాబట్టాను. ఎక్కడో నాగర్ కర్నూల్ నుండి సత్యనారాయణగారి గురించి వచ్చాట్ట.

ఆయన లేకపోవడంతో నన్ను కలవమని ఎవరో చెబితే నా కోసం ఇలా...

''కాఫీ తీసుకుంటారా?'' 'నేను తాగబోతున్నా మరోసారి నీ మొహాన గుమ్మరించక తప్పుద్దా?' అన్న అర్థంలోతో నేను.

''అబ్బే! ఇప్పుడే తీసుకున్నాను''. ఋజువుగా ఖాళీ కప్పు చూయించాడు.

అదేగా నాక్కావాల్సింది. తాపీగా కాఫీ కప్పును ముద్దాడుతూ అడిగాను- '' ఊం! చెప్పండి''!.

''నా పేరు నాగభూషణం, నాగర్ కర్నూల్ నుండి వచ్చాను. కొత్తగా కాలేజి ఓపెన్ చేశాం. పిల్లల్ని మన సాహిత్యంవైపు, సంస్కృతివైపు మోల్డ్ చేయడంలో తొలి ప్రయత్నంగా శ్రీ సత్యనారాయణ గారి ఉపన్యాసం...''

కాఫీ రుచి మారిపోయిన అనుభూతి.

'' ఈ మాత్రానికి ఇంత దూరం రావాలా? హైదరాబాద్‌లోనే (ఎవరైనా మాట్లాడితే) మీకింకా సౌకర్యంగా ఉండేది కదా!'' అన్నాను.

అదేదో ఆయన ఆసక్తిని నేను టెస్ట్ చేస్తున్నట్లు ఫీలైపోయి ''ఎవరొచ్చినా సత్యనారాయణగారితో సమానం కాదు కదండీ!'' మొహం నిండా వినయం.

కాఫీ చేదైపోయింది.

నేనొక రచయితని, వ్యాఖ్యాతని, వక్తని... నన్ను ముందుంచుకునే ఆ ఛాందసుని గురించి అతిశయోక్తులు పలుకుతుంటే, సోఫాసెట్లో ముళ్ల కనిపిస్తాయా? లేదా? కాని, నేను చేయగలిగిందేమీ లేదు.

'' ఊం ఏమైందీ మరీ?'' ముక్తసరిగా నేను.

'' ఆయన లేరు. అమ్మగారు వారికి 15 రోజుల దాకా డేట్స్ ఖాళీ లేవని చెప్పారు. మిమ్మల్ని కలవమన్నారు''. ఆవిడ కలవమన్నారు కాబట్టి వచ్చాను' అన్న ధ్వని నాకు స్పష్టంగానే వినిపిస్తోంది.

''ఆ! నేనేం మాట్లాడగలనండీ, నా మొహం!'' మొహమాటం ప్రదర్శించాను సహజంగానే.

''అహ! మీరు మాట్లాడతారని కాదు''. వెంటనే అందుకున్నాడా శాల్తీ! ''మరొకర్నెవర్నైనా పరిచయం చేస్తారేమోనని'' అన్నాడు నా మొహమాటాన్ని నిర్మొహమాటంగా తుంచేస్తూ.

నిలువుటద్దం మీద గురిచూసి విసిరిన రాయిలా- నా ఆత్మాభిమానానికి తగిలాయతని మాటలు. దీర్ఘాలోచనలో పడ్డాను. నా గురించి ఆలోచిస్తూ, సందర్భం గురించి ఆలోచించేందుకు సమయం పట్టింది.

అతనికేసి చూశా. నిండు కుండాలా ఉన్నాడు. మొహంలో కల్మషం లేదు.

' ఇతడ్ననేం లాభం? ఆ మహాతల్లి ననాలి. కాదు- ఆవిడకైనా మన

గురించేం తెలుసు? ఆ మహానుభావుడే మన గురించి ఇంత మంచి 'కల్పన' నిచ్చాడన్నమాట. అతడు ఛాందసుడే కాదు. పచ్చికుళ్లబోతనే సంగతి ఇప్పుడర్థమైంది.

''ఎవర్ని కలుద్దామంటారు?'' కాలం వత్తిడిని తట్టుకోలేక దూరభారాన్ని గుర్తు చేసుకుంటున్నట్లుగా వచ్చినవాడు.

''అదే ఆలోచిస్తున్నాను'' అన్నాను. అప్పుడే ఆ విషయం తప్పనిసరై ఆలోచిస్తూ. ఓ అయిదు నిముషాల తర్వాత. ''సరే! పదండిహ అంటూ ముందుగా రామ శర్మ ఇంటికి బయల్దేరదీశాను.

★ ★ ★

''నావల్లే మౌతుంది గురూ! నన్నొదిలేసెయ్!'' చివరి మాట అంటున్నట్టు రామశర్మ.

''శర్మగారు మీరు ఉభయ భాషలూ తెలిసినవారు, వేదం చదువుకున్నారు. పండితులు. సత్సంగ సమావేశాల్లో తిరిగేవారు, వక్తలు... మీరే కాదంటే ఎలా చెప్పండి?'' అన్నాను తప్పించుకోవడం నేరమన్న ధోరణిలో.

''అయిపోయిందా దండకం? ఎన్నున్నా మీ ప్రతిభలో ఓ మూలకి చాలవు''. నా సుత్తిని సమ్మెటతో కొట్టాడు- దటీజ్ రామ శాస్త్రి.

'తెలిసిందా మన ప్రతిభ' అన్నట్టు చూశాను వ॥వా॥ (వచ్చినవాడు) వైపు. గోడమీది పిడకలా ఏ భావమూ లేదు. మరదే నాకు నచ్చనిది.

''మీరలా అనకూడదు సార్! ఎంతో ఆశతో ఆయన నాగర్ కర్నూల్ నుండి వచ్చారు. సత్యనారాయణ గారుంటే మనకీ బాధ ఉండేదికాదు. అనుకోకుండా ఈ భారం నా మీద పడింది. మీరు తప్పించుకునే ప్రయత్నం చేయకండి'' ప్రాధేయపడ్డాను.

''సత్యనారాయణగారి స్థానాన్ని ఇంకొకరెవ్వరూ పూర్తి చేయలేరు. ఎంతో కొంత సామర్థ్యముందంటే అది ఆయన చలవే. కాని, ఈ కార్యక్రమానికి నా ప్రతిభ చాలదు. మీరుచెబుతున్నారు కాబట్టి, ఇక ముందు ఏవైనా కార్యక్రమం వస్తే, మరీ ముందుగా తెలియజేస్తే ప్రిపేర్ అయ్యేందుకు ప్రయత్నిస్తా!'' ఇక మీరుదయ చేయొచ్చు' అన్న అర్థంలో శర్మగారు.

★ ★ ★

'' ఆచార్యుల వారున్నారాండీ?'' బెల్లు మోత విని బయటికొచ్చిన రంగాచార్యుల శ్రీమతిగారి నుద్దేశ్యించి అడిగాడాశగా ఆయన లేందే ఆ ఇంట్లోకి

ప్రవేశముండదు. కులం వాసనలు ఇంకా బలంగా వీస్తున్నాయనడానికి ఈ ఇంటి వాతావరణం ప్రత్యక్ష నిదర్శనం.

'' ఉన్నారు'' అందావిడ పొడిగా. పరిశీలనగా చూసింది. గుర్తుకొచ్చినట్టున్నాను. ''రండి'' అంది- తప్పదన్నట్టు.

ఇబ్బందిగా కదిలాం లోనికి. చిన్న వరండా.

వరండా అనలేం. 'కోఠరీ' (సామానులగది) ఉంది. అందులో అధికశాతం చెప్పులే. వాటి మధ్య ఇరుకిరుగ్గా మూడు కుర్చీలు పట్నం బతుకును సాక్షాత్కరింపజేస్తూ.

మొహం మీదంటిన చికాకును తుడిచేసుకుంటూ ప్రత్యక్షమయ్యాడు రంగాచార్యులు.

'' ఓహో! మీరా!.... చెప్పండి!'' అన్నాడు తనకవతల పనుందన్నట్టు.

ఉపోద్ఘాతానికి వెళ్లకుండా పేజీ తెరిచాన్నేను. ''వీరు నాగభూషణంగారు, నాగర్ కర్నూలు నుండి వచ్చారు. వాళ్ళ కాలేజీలో సాహిత్యోపన్యాసం ఏర్పాటు చేసుకుంటారట.''

ఆయనకో నమస్కారం పడేసి నావంక చూశాడు రంగాచార్యులు. 'అయితే ఏవిటట' అన్న భావంలో '' ఊఁ!'' అన్నాడు.

'' ఊఁ ఏవిఁటండీ? వక్తగా మీరెళ్ళాల్సుంటుంది'' అన్నాన్నేను, ఆయన పోజుకి లోలోపల మండిపోతూ.

''మీకేమైంది?'' 'మీరెళ్ళొచ్చుగా!' అనే ధ్వని ఆచార్యుల గొంతులో.

''బలేవారే! అక్కడ మాట్లాడాల్సింది వ్యావహారికాలు కాదు; సాహిత్యం గురించి. ఆ పని మీరైతేనే సవ్యంగా చేయగల్గుతారని...'' అని నేను.

''కాదు, కాదు... మీరైతేనే బావుంటుంది'' అని ఆచార్యులు ఇలా కొంచెం సేపు జోగి జోగీలా రుద్దుకున్నాం.

''సార్! నాకు సెలవిప్పించండి. మరోసారి ముందుగానే సత్యనారాయణ గారితో ఫోన్‌లో అపాయింట్‌మెంట్ తీసుకుని వస్తాను. అనవసరంగా మీకు శ్రమకల్గించాను. ఆలస్యమైతే నాకు బస్సులు దొరకడం కష్టమౌతుంది'' అంటూ మా సమాధానం కోసం ఎదురు చూడకుండా నిష్క్రమించాడాయన.

★ ★ ★

పాలమూర్ (మహబూబ్ నగర్) బస్ స్టేషన్‌లో నాగర్ కర్నూల్ బస్సు కోసం ఎదురుచూడ్డంలో నలభై నిముషాలు గడిచిపోయింది. కంట్రోలర్ నడిగితే

ఆర్.టి.సి. (రాదు, తెలీదు, చెప్పలేం) సిద్ధాంతాన్నే తిరగేస్తున్నాడు. ఎలా కాలక్షేపం చేయాలా... అంటూ తలబద్దలు కొట్టుకుంటుంటే హఠాత్తుగా కనిపించాడు వేంకటేశ్వర్లు. నేను పలకరించేలోపే నన్ను చూశాడు.

''హలో! నరహరీ!'' అంటూ ఆలింగనం చేసుకున్నాడు.

వాడో తుపాన్ మెయిల్. మెదడులో పాదరసం, నాలుకపై వాగ్రసం. అందుకే వాడంటే ఇష్టపడని వారుండరు. నాకూ మినహాయింపులేదు. సహజంగానే.

జడ్చర్లలో వాళ్లత్తగారి ఊర్నుండి ఇంటికెళ్తూ కనెక్షన్ బస్సుకోసం ఎదురు చూస్తూ, నన్ను 'పట్టేశాడు' ఒకేపట్నంలో ఉంటున్నా ఇద్దరమూ సరదాగా కాలక్షేపం చేసే అవకాశాలు చాలా అరుదే. ఆ మాటా ఈ మాటా మాట్లాడి వర్తమానంలో పడ్డా. సత్యనారాయణగారి ఆదేశాల మేరకు నేను నాగర్ కర్నూల్ సాహిత్యోపన్యాసం చేయడానికి వెళ్తున్నానని చెప్పాను.

' ఏంటీ, నిన్ను సత్యనారాయణ గారు పంపారా? ఏంటీ, నేన్నిజమే వింటున్నానా?'' మొహం నిండా ఆశ్చర్యం.

''అదే కదా! మరినన్నిక్కడిదాకా లాక్కొచ్చింది''నా వివరణ .

''సచ్చా పంపాడా'' నేనూహించలేదు స్మీ!'' సచ్చా అనేది సత్యనారాయణగారికి వాడు పెట్టుకున్న ముద్దుపేరు. (సత్యనారాయణ చాదస్తం).

'' ఆ, నాదాకా వచ్చేది కాదులే. ఆ నాగర్ కర్నూల్ శాస్త్రీ వచ్చిప్పుడు ఆయన ఊళ్లో లేకపోవడం, నన్ను కలిస్తే నేను ముందు రామశర్మ, రంగాచార్యులకోసం ప్రయత్నించడం జరిగింది...'' ఆ వైనాన్ని కాస్త వివరించా.

''వాళ్లిద్దరూ ఆయన శిష్యులే ఆయినప్పటికీ ఆయన చాదస్తం కారణంగానే అతని పట్ల నిరసన పెంచుకున్నారు గురూ! వాళ్లకు కార్యక్రమానికి వెళ్లాలనున్నా, ఆయన చెప్పాడన్న కారణం చేతనే తప్పించుకున్నారనేది మాత్రం నిజం.

'' ఎందుకంటే, ఏనాడు వీళ్లు చేసిన పనుల్నీయన సమర్థించాడు కనుక? రామశర్మ అవధానం చేస్తే, తనను వ్యాఖ్యాతగా పిలవలేదని, అదసలు అవధానమే కాదంటూ తేల్చి పారేశాడు. ఓసారైతే శిక్షణా శిబిరానికి ఓపూట ఆలస్యంగా వచ్చాడని, వెనక్కి పంపించాడు. మరోసారి జాతీయతా వాదం గురించి శర్మ ఉపన్యాసించిన సభలో తగుదునమ్మా అంటూ మైకందుకొని అందులో హిందూత్వం గురించి ఒక్క ముక్కైనా లేదేమంటూ ఉపన్యాసానికి పూర్వ పక్ష ప్రసంగం చేశాడు''.

నేను తెలిసీ తెలియని విషయాలను వెంకటేశ్వర్లు మాటల్తో సమన్వయం చేసుకునే ప్రయత్నంలో పడ్డాను.

'' ఇక రంగాచారి స్వయాన ఈయనకి మేనల్లుడు. పైకి ఆదర్శవాదాలు వల్లించే ఈ సచ్చా మహాపురుషుడు ఇంట్లో మాత్రం నియంత. ఎవ్వరికీ స్వేచ్ఛ నిచ్చేవాడు కాదు. నయాపైసా ఖర్చునైనా సహించడు. పొదుపు పొదుపంటూ ఇంట్లోనెలకు అధమ 'పక్షం' పచ్చడి మెతుకులే. అది భరించలేకనే గదా రంగాచారి వేరుకుంపటి పెట్టుకున్నది. ఆ మహాతల్లి మాత్రం ఎలా భరిస్తున్నదో...''

ఇంకా ఏమేం చెప్పేవాడో వెంకటేశ్వర్లు ప్రసంగాన్ని అడ్డుకుంటూ ఓ అర్భకుడు మా మధ్యకొచ్చాడు. ''నమస్తే!''

ఇద్దరమూ మొహాలు చూసుకున్నాం. 'నీకు పరిచయమా??'' అన్నట్లు.

'సారీ సర్! మీ ఇద్దరికీ నేను కొత్తే. కాని, మీరు మాట్లాడుకుంటున్న విషయానికి మాత్రం పాతవాడ్ని'. అంటూ తన ఉనికి గురించి చెప్పాడు.

మా మనస్సుల్లో సందేహాలు మాటలుగా మారక ముందు అతనే అందుకున్నాడు మళ్లీ– ''నేనూ పరిగిలోనే చదువుకున్నాను సర్. నాపేరు ఆదిత్య. సత్యనారాయణగారి వందలవేల మంది శిష్యుల్లో నేనొకడ్ని. ఆయన పుణ్యం కారణంగానే నేనీ రోజు ఒక ఉపాధ్యాయుడిగా బతకగల్గుతున్నాను.

'' ఇంటర్ పూర్తయిన తర్వాత వదినెలు ఆదరించక, ఆపై చదివే స్తోమత లేక రైళ్ళు రాని ప్లాట్ ఫారం మీద అమోయమంగా ఉన్న నా చీకటి బతుక్కి ఆయన కరదీపిక అయ్యారు. సంఘం అనుబంధ సంస్థయైన విద్యా పీఠంలో ఉపాధ్యాయుడిగా నన్ను చేర్చి ఆపై ఆర్థిక సహాయం చేసి డిగ్రీ పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకునేలా అన్ని విధాలా సహకారం అందించారు.

''నేనే కాదు నాలాంటి వాళ్లెందరో ఆయన నుండి సహకారాన్ని పొంది బతుకులు దిద్దుకున్నారు. మీరనుకుంటున్న రంగాచారి నా క్లాస్‌మేటే. తల్లిదండ్రిలేని రంగాచారికి కులం కూడా తెలీదు. అటువంటి వాడ్ని తన మేనల్లుడిగా పరిచయం చేసి, విద్యాబుద్ధులు గరిపి, పెళ్లి చేస్తే, స్వార్థంతో అతను ఇల్లొదిలి వెళ్ళిపోయాడు.

'రామశర్మ గారి గురించి ఆయనేదో చేశాడన్న మీ అభిప్రాయం కూడా తప్పు. శర్మగారి గురించి ఎక్కడైనా సత్యనారాయణగారు గొప్పగానే చెబుతారు. అసలు అవధానిగా ఆయన్ని సమాజానికి పరిచయం చేసింది కూడా ఆయనే.

ప్రశంసను బహిరంగంగా, విమర్శను అంతరంగంగా ప్రకటించే మంచి బుద్ధికి నిదర్శనమాయన.

''క్రమశిక్షణ, సమయపాలన, నిస్వార్థం, నిరాడంబరాలకు నిలువుటద్దమైన ఆయన గురించి మీరిలా మాట్లాడుకోవడం అంత బాగా లేదు. గాంధీ గారంతటివాడి గొప్పతనాన్నే అంగీకరించ లేక స్త్రీలోలుడనే పచ్చి ముద్రవేసిన సమాజంలో మనమున్నాం. నిజాలను గ్రహించడం, మంచిని ప్రశంసించడం, ఉత్తముల 'గుణాల్ని' ఆదర్శాలుగా ప్రచారం చేయడం మనలాంటి వాళ్లు అలవాటు చేసుకోవాలి.

''ఆ! ప్రస్తుతం నేనెక్కడ పని చేస్తున్నానో చెప్పలేదు కదూ! నాగర్ కర్నూల్ ఉన్నత పాఠశాలలో తెలుగు బోధిస్తున్నాను. ఓ ముఖ్యమైన పనిమీద ఇక్కడికొచ్చాను. తిరుగు ప్రయాణం బస్సుకోసం ఎదురు చూస్తున్న నన్ను మీమాటలు ఆకర్షించాయి.

''నరహరిగారు మీరేననుకుంటూ. సత్యనారాయణగారికి మీరంటే ఎంతో గురి. ఆయన్ని ప్రసంగం కోసం పిలిస్తే, మీరైతేనే బాగుంటుందని, మీ ప్రతిభ గురించి దాదాపు అరగంట వర్ణించారు. అటువంటి మహనీయుని గురించి ఇలా మాట్లాడుకోవడం నాకు బాధగా ఉంది...''

'పరోక్షంగానైనా, ప్రత్యక్షంగానైనా వ్యక్తి నింద మంచిది కాదు, విమర్శ ద్వారా గుణాలు ప్రకాశించాలికాని, దుర్గుణాలు వేళ్ళూనుకోవ''ద్దంటూ సత్యనారాయణగారు తరచూ చెప్పే మాటలు గుర్తుకొచ్చాయి.

మా అందరి ఉన్నతికి, మాలాంటి ఎందరో అర్భకుల అస్థిత్వానికి 'తల్లివేరు'లా నిలిచిన ఆయన మంచితనాన్ని ఆలోచిస్తూ... ఆదిత్యకు చేతులెత్తి నమస్కరించాను.

*(జాగృతి 12–18, ఏప్రిల్ '99 వారపత్రిక)*